# నేటి నుంచి పత్తి కొనుగోళ్లు

- సీసీఐ ఆధ్వర్యంలో సేకరణ
- ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 11 కేంద్రాలు
- మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఆదిలాబాద్, అక్టోబర్ 29 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో రైతులు వానాకాలం సీజన్‌లో పత్తి పంటను ఎక్కువగా సాగు చేస్తారు. జిల్లాలో నల్లరేగడి నేలలు సాగుకు అనుకూలంగా ఉండడం ఇందుకు కారణం. పత్తి సాగు రైతులకు లాభదాయకంగా మారింది. దీంతో ఏటా జిల్లాలో సాగు విస్తీర్ణం పెరుగుతున్నది. గతేడాది 3,83,251 ఎకరాల్లో రైతులు తెల్ల బంగారాన్ని పండించిగా, ఈ ఏడాది 4,12,436 ఎకరాల్లో పంటను వేశారు. గతేడాది జిల్లాలో ప్రైవేటు వ్యాపారులు మద్దతు ధర కంటే ఎక్కువ వెచ్చించి రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేశారు. మద్దతు ధర రూ.6,380 ఉంటే రూ.9 వేల వరకు చెల్లించి, పంట సేకరించారు. ఈ ఏడాది పంట కొనుగోళ్లకు అధికారులు పకడ్బందీ ప్రణాళికలు తయారు చేశారు. రైతులు ఇబ్బందులు పడకుండా జిల్లాలోని అన్ని మార్కెట్ యార్డుల్లో ఏర్పాట్లు చేశారు. ఈ సారి ఆధార్ అనుసంధానంతో రైతుల వద్ద నుంచి పంట సేకరించనున్నారు. ఇందుకు మార్కెట్ యార్డుల్లో బయోమెట్రిక్ యంత్రాలను ఏర్పాటు చేశారు. పంట విక్రయానికి సంబంధించిన డబ్బు నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమవుతాయి.



కాంటాలను పరిశీలిస్తున్న అధికారులు

### నేటి నుంచి కొనుగోళ్లు..

రైతులు ఈ సీజన్‌లో సాగుచేసిన పత్తిని నేటి నుంచి కొనుగోలు చేయనున్నారు. ఇందుకు జిల్లా వ్యాప్తంగా సీసీఐ ఆధ్వర్యంలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సీజన్‌లో 28.87 లక్షల క్వింటాళ్ల పంట మార్కెట్ వస్తుందని అంచనా వేసిన అధికారులు, ఆదిలాబాద్, బోథ్, ఇంద్రవెల్లి, ఇచ్చోడ, జైనథ్ పరిధిలో 11 సీసీఐ కేంద్రాల్లో ఆదిలాబాద్‌లో రెండు, బేల, ఇచ్చోడ, బోథ్, సొనాల, పొచ్చర, నేరడిగొండ, ఇంద్రవెల్లి, నార్నూర్‌లలో మద్దతు ధరతో పంట సేకరించనున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాకు రూ.7,020 మద్దతు ధర ప్రకటించింది. గతేడాది రూ.6,380 ఉండగా, రూ.640 పెంచింది. జిల్లాలోని 18 జిన్నింగ్‌లో సీసీఐ అధికారులు లీజుకు తీసుకొని సేకరించిన పత్తిని ప్రాసెసింగ్ చేయనున్నారు.

### పత్రాలను దగ్గర ఉంచుకోవాలి..



*ఆదిలాబాద్ జిల్లాలో నేటి నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతాయి. ఇందుకోసం మార్కెట్‌యార్డుల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో రైతులు పంటను విక్రయించిన రశీదులను తమ వద్ద ఉంచుకోవాలి. దీంతో నగదు తీసుకుపోవడంలో ఎలాంటి ఇబ్బందులు ఉండవు. సంబంధిత పత్రాలు దగ్గర ఉంచుకొని ఎవరైనా అడిగితే చూపించాలి.*

**- శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ అధికారి, ఆదిలాబాద్ జిల్లా**





చెక్‌పోస్ట్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

## అప్రమత్తంగా ఉండాలి

- ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి
- మేడిగూడ చెక్‌పోస్టు ఆకస్మిక తనిఖీ

నార్నూర్, అక్టోబర్ 29 : ఆదిలాబాద్-మహారాష్ట్రకు సరిహద్దు గాదిగూడ మండలం మేడిగూడలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద పోలీస్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. చెక్‌పోస్ట్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు వివరాలు తెలుసుకుంటూ, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. చెక్‌పోస్ట్ నుంచి వెళ్లే ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఓటర్లను ప్రలోభపెట్టడానికి డబ్బు, మద్యం, విలువైన వస్తువులు అక్రమంగా తరలించే అవకాశాలుంటాయన్నారు. మహరాష్ట్ర సరిహద్దులో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత, వివరాలు నమోదు చేయాలని తెలిపారు. చుట్టు పక్కల గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఆయన వెంట నార్నూర్ సీఐ కే ప్రేమ్‌కుమార్, గాదిగూడ ఎస్ఐ మహేశ్, చెక్‌పోస్ట్ పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## గుండె ఆపరేషన్ చేయించిన జాన్సన్‌నాయక్



చికిత్స పొందిన మామిడిపెల్లి శంకర్

కడెం, అక్టోబర్ 29 : కడెం మండలం దిల్దార్‌నగర్ గ్రామానికి చెందిన మామిడిపెల్లి శంకర్ కొద్ది రోజులుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ బద్దెనపల్లి విజయస్టీఫెన్.. ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జాన్సన్‌నాయక్, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు వారు స్పందించి, శంకర్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చేర్పించారు. చికిత్స అందించారు. శస్త్రచికిత్స కోసం రూ. 5 లక్షల వరకు ఖర్చు కావడంతో ఎల్‌వోసీ నుంచి రూ.3.40 లక్షలు, ఆరోగ్య శ్రీ ద్వారా రూ.1.60 లక్షలతో విజయవంతంగా ఆపరేషన్ చేయించారు. కాగా, శంకర్‌ను వైద్యులు ఆదివారం డిశ్చార్జి చేసినట్లు సర్పంచ్ తెలిపారు. పేద కుటుంబానికి రూ.5 లక్షలతో గుండె ఆపరేషన్ చేయించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఖానాపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండె విఠల్‌కు సర్పంచ్, ఉప సర్పంచ్ కరుణాకర్ కృతజ్ఞతలు తెలిపారు. ఆ పేద కుటుంబం వీరికి రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. గుండె ఆపరేషన్ అనంతరం వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# గిరిజన యువతి హత్యపై విచారణ

- గ్రామ పెద్దల నుంచి వివరాలు సేకరించిన ఎస్పీ ఉదయ్‌కుమార్
- నిందితులను త్వరలోనే పట్టుకుంటామని వెల్లడి

ఉట్నూర్, అక్టోబర్ 29 : ఉట్నూర్ మండలం భీంజీగూడలో పత్తి పంటకు కాపలా వెళ్లిన గిరిజన యువతి హత్య సంచలన సృష్టించింది. దీంతో పోలీసులు రంగంలోకి దిగారు. ఆదివారం ఆదిలాబాద్ ఎస్పీ ఉదయ్‌కుమార్, ఉట్నూర్ ప్రభుత్వ దవాఖానలో యువతి మృతదేహాన్ని పరిశీలించారు. గ్రామ పెద్దలతో మాట్లాడారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని, ఇప్పటికే ముమ్మరంగా విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వివరాలోలకి వెళితే.. మండలంలోని దొంగచింత పంచాయతీ పరిధిలోని భీంగూడ గ్రామానికి చెందిన తొడసం గుణవంత్‌రావు, లక్ష్మీబాయి వ్యవసాయం చేసుకుంటూ బతుకుతున్నారు.



గ్రామస్తుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

వీరికి 8 మంది సంతానం. రెండో కూతురు ఉట్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నది. దసరా సెలవుల సందర్భంగా ఊరికి వచ్చింది. శనివారం పత్తి చేనుకు కాపాలాగా వెళ్లింది. రాత్రి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చేనులో వెతికారు. పొదల్లో మృతదేహం కనిపించడం, తలపై బండరాయితో కొట్టినట్లు ఆనవాళ్లు ఉండడంతో పోలీసులను ఆశ్రయించారు. ఆదివారం ఉదయం ఉట్నూర్ డీఎస్పీ నగేందర్, సీఐ రామకృష్ణ, ఎస్ఐ మనోహర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించారు. తల్లి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



న్యూసాంగ్వీలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు

## సీసీ రోడ్లతో గ్రామాలు కళ కళ

- హర్షం వ్యక్తం చేస్తున్న పల్లెప్రజలు

మామడ, అక్టోబర్ 26 : ఒకప్పుడు గ్రామాల్లో మట్టిరోడ్లతో ప్రజలు నరకయాతన అనుభవించేవారు. తెలంగాణ ఏర్పాటై, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీసీ రోడ్ల నిర్మాణాలకు అధిక ప్రాధాన్యమిచ్చింది. నిధులు మంజూరు చేయడంతో పల్లెల్లో మట్టిరోడ్లన్నీ సీసీ రోడ్లుగా మారాయి. పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రధాన రోడ్లన్నింటినీ అభివృద్ధి చేశారు. గడిచిన పదేళ్లలో విడుతల వారీగా మండలంలోని గ్రామాల్లో అద్దల్లా మెరిసిపోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS & AP No. 1) Hyd., VJA. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు వర్కర్లు (M/F) కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్: 5,000/-. Ph: 9281452833, 6281208600.
NT-320535

★ ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. సంప్ర: 7396856819, 7386886819.
NT-320424-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

